నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, బుధవారం 20 మార్చి 2024 | HYDERABAD




బడంగ్‌పేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



కార్యక్రమంలో ప్రదర్శించిన కేరళ సంప్రదాయ నృత్యాలు

# మళ్లీ కేసీఆర్ పాలన రావాలి!

**బీఆర్ఎస్‌ను ఎందుకు ఓడించామని ప్రజలు బాధపడుతున్నారు**

పార్టీని వీడుతున్న వారికి తగిన గుణ పాఠం తప్పదు

వంద రోజుల కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాఫ్

కాంగ్రెస్, బీజేపీలను చిత్తుచిత్తుగా ఓడించాలి

స్వార్థపరుడు, మానవత్వం లేని వ్యక్తి రంజిత్‌రెడ్డి

చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

ప్రజాప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను చిత్తు చిత్తుగా ఓడించి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. వందరోజుల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేఖత పెరిగిందని, కేసీఆర్‌ను ఎందుకు ఓడించామని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని, వంద రోజులు గడిచినా ఒక్కహామీని నెరవేర్చలేదన్నారు. రైతు రుణమాఫీ, మహిళలకు రూ.2500, 4వేలు పింఛన్ ఎందుకు అమలు చేయలేదో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాముడి పేరుతో రాజకీయం చేసి ఓట్లు దండుకోవాలని చూస్తుందని ఆరోపించారు. మోదీ సముద్రంలో మునిగితే దేశంలోని అన్ని సమస్యలు సమసి పోతాయా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లధనం తేస్తామని, పేదల అకౌంట్లలో రూ.15లక్షలు వేస్తామని, సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు.

### రంజిత్ రెడ్డి అంటే ఎవరో ప్రజలకు తెలియదు

మనస్సున్న వాడు ఎవ్వడూ కష్ట కాలంలో పార్టీ మారరని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల ప్రజలకు రంజిత్ రెడ్డి ఎవరో తెలియదని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎక్కడో ఉన్న వ్యక్తిని తీసుకొచ్చి చేవెళ్ల ఎంపీగా గెలిపించి ఉన్నత స్థానంలో కూర్చోబెడితే.. మానవత్వం లేని రంజిత్‌రెడ్డి తన స్వార్థం కోసం పార్టీ మారారని విమర్శించారు.

### కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుతున్నారు

ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిన కేసీఆర్‌ను ఎందుకు ఓడించామని ప్రజలు మదన పడుతున్నారని, మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పవన్ కుమార్ యాదవ్, రాంరెడ్డి, అర్జున్, స్వప్నావెంకట్‌రెడ్డి, స్వప్నా జంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బడంగ్‌పేట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంతోశ్‌కుమార్, కృష్ణ, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, ఆనంద్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

# మల్కాజిగిరి గడ్డపై.. గులాబీజెండా ఎగురవేద్దాం

ముఖ్యనాయకుల సమావేశంలో..

ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్‌మెట్, మార్చి 19 : బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం నేరేడ్‌మెట్ డివిజన్ జీకే పంక్షన్‌హాల్‌లో మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో నిలిపిన ఘనత, ఐటీ అభివృద్ధికి కారణం కేసీఆర్ అని అన్నారు. పోటీ చేసే అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ధన్యవాదాలు తెలిపారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరిలో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏకే మురుగేశ్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, మీనా, మేకల సునీతా రాముయాదవ్, సబిత అనిల్‌కిశోర్, మాజీ కార్పొరేటర్లు జగదీశ్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రావుల అంజయ్య, బద్దం పరశురాంరెడ్డి, జీకే హన్మంతరావు, శ్రీనివాస్ రెడ్డి, రాజు, ఉపేందర్‌రెడ్డి, రంపె చంద్రమౌళి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 22 నుంచి ఐకియా రోటరీ వద్ద ట్రాఫిక్ మళ్లింపు

సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ): ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఐకియా రోటరీ వైపు వచ్చే అన్ని రూట్లలోని వాహనాలను మళ్లిస్తున్నామని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ తెలిపారు. మార్చి 22 నుంచి అమల్లోకి వస్తాయన్నారు.

- సైబర్ టవర్స్‌కు వెళ్లాలనుకునేవారు ఐకియా అండర్‌పాస్ నుంచి వెళ్లాలి, కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లేవారు ఐకియా రోటరీ వద్ద కుడి వైపు తీసుకొని కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లాలి.
- రోటరీ వద్ద నుంచి వెళ్లే వారు యూ టర్న్ తీసుకొని వెళ్లేందుకు అవకాశముంటుంది.
- రోటరీలోకి వచ్చిన తరువాత కుడివైపు తీసుకునేందుకు అవకాశముంటుంది. అలాగే ఫ్రీ లెఫ్ట్ నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లాలి.
- బయోడైవర్సిటీ జంక్షన్‌కు వెళ్లాలనుకునే వారు ఐకియా అండర్ పాస్ నుంచి వెళ్లాలి.
- ఐకీయా రోటరీ నుంచి నేరుగా వెళ్లి సీ గేట్ మొదటి యూటర్న్‌ను ఉపయోగించుకొని బయోడైవర్సిటీ వైపు వెళ్లాలి.



# ముట్టుకుంటే ఒట్టు

## కొత్వాల్‌గూడ పార్కును గాలి కొదిలేసిన సర్కార్

మూడు నెలలుగా నిలిచిపోయిన పనులు

బీఆర్ఎస్ హయాంలో 60శాతం పనులు పూర్తి

సమీక్షించని కమిషనర్, గ్రీన్ సిగ్నల్ ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

త్వరితగతిన పూర్తి చేయాలంటున్న నగర వాసులు

దేశంలోనే మొట్ట మొదటి వాటర్ టన్నెల్ ఆక్వేరియం, అతి పెద్ద పక్షిశాల



సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెడుతున్నది. నగర వాసులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన, ఆహ్లాదకరమైన పార్కును తీసుకువచ్చేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ సుమారు రూ.300 కోట్ల అంచనా వ్యయంతో కొత్వాల్‌గూడ ఎకో పార్కు ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. గత ఏడాది నవంబర్ నాటికి సుమారు 50-60 శాతం పనులు పూర్తయినప్పటికీ దాన్ని పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపడం లేదు. ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు గడిచినా నగర ప్రతిష్టతను ఎంతగానో పెంచే ఎకో పార్కును పూర్తి చేయడంలో హెచ్ఎండీఏ అధికారులు ముందడుగు వేయడం లేదు.

### సమీక్ష జరుపని కమిషనర్

ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీగా, హెచ్ఎండీఏ మెట్రో పాలిటన్ కమిషనర్‌గా ఉన్న దానకిశోర్ హెచ్ఎండీఏలోని పలు విభాగాల వారీగా సమీక్షలు చేస్తున్నా, కొత్వాల్ ఎకో పార్కు విషయంలో ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ ప్రాజెక్టు ఏం అవుతుందోనన్న సందేహాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఔటర్ రింగు రోడ్డు, మరోవైపు జంట జలాశయాల్లో ఒకటైన హిమాయత్‌సాగర్ తీరంలో సుమారు 85 ఎకరాల స్థలంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు నగరానికి మరో మకుటంగా మారే అవకాశం ఉన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ₹ 300 కోట్ల అంచనాతో..

దేశంలోనే మొట్ట మొదటి వాటర్ టన్నెల్ ఆక్వేరియం, 5 ఎకరాల్లో అతి పెద్ద పక్షిశాల, ఎత్తయిన గుట్టల మధ్య 2.5 కి.మీ పొడవునా బోర్డు వాక్, అందమైన పచ్చిక బయళ్లు, క్వారీల మధ్య నీళ్లలో బోటింగ్, రెస్టారెంట్లు.. ఇలా ఎన్నో ప్రతిష్టాత్మక అంశాలతో చేపట్టిన ప్రాజెక్టు ఎకో పార్కు. హిమాయత్‌సాగర్, ఔటర్ రింగు రోడ్డు మధ్యన 85 ఎకరాల్లో సుమారు రూ.300 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ పర్యాటక ప్రాజెక్టు హైదరాబాద్ మహానగర వాసులకే కాకుండా యావత్ దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేల నిర్మిస్తున్నారు. అలాంటి ప్రాజెక్టు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నది. హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఇప్పటి వరకు సమీక్ష చేయకపోవడం, ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. ప్రభుత్వం దృష్టిసారించి కొత్వాల్‌గూడ ఎకో పార్కు నిర్మాణంలో వేగం పెంచాలని నగర వాసులు కోరుతున్నారు.



శంషాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, తదితరులు

# కాసానిని గెలిపిద్దాం..

## కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం

కొందరు పార్టీ మారినంత మాత్రాన.. ఒరిగేదేమీ లేదు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

శంషాబాద్ రూరల్, మార్చి 19 : చేవెళ్ల ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్త పనిచేసి చేవెళ్ల ఎంపీ స్థానాన్ని బహుమతిగా ఇవ్వాలని సూచించారు. పార్టీ కష్టాల్లో ఉన్న సమయంలో కొందరు నాయకులు పార్టీ మారినా.. కార్యకర్తలు మనోధైర్యం కోల్పోకుండా పని చేయాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తయారు చేశారని చెప్పారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతుల పంటలు ఎండిపోతున్నా.. పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గణేశ్‌గుప్త, మండల పార్టీ అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, జడ్పీటీసీ తన్విరాజు, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, నీరటి రాజు, మోహన్‌నాయక్, సహకార సంఘం చైర్మన్‌లు బుర్కుంట సతీష్, దవాణాకర్‌గౌడ్, కౌన్సిలర్లు జాంగిర్‌ఖాన్, మేకల వెంకటేశ్, ఆయిల్‌కుమార్, అజేయ్, చెన్నం ఆశోక్, నాయకులు కె.శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, జీవై ప్రభాకర్, పరంధాములు, ధన్‌పాల్‌రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యేల భేటీ

శంషాబాద్ పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు కోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తెలిపారు.

# కేరళలో హెలీ టూరిజం

ఖైరతాబాద్, మార్చి 19 : పర్యాటక రంగంలో విశిష్టత కలిగిన ప్రాంతంగా విరాజిల్లుతున్న కేరళలో 'స్కై ఎస్కేప్స్' పేరుతో హెలీ టూరిజాన్ని ప్రవేశపెడుతున్నామని కేరళ పర్యాటక శాఖ సమాచార విభాగం అధికారి ఎండీ సలీం తెలిపారు. సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో తొలి సమగ్ర 'హెలీ టూరిజం' పాలసీని తీసుకువచ్చిన తొలి రాష్ట్రంగా కేరళ నిలుస్తుందన్నారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు పారా గ్లైడింగ్ ఫెస్టివల్‌ను నిర్వహించామని, 29 నుంచి 31 వరకు వర్కాలలో ఇంటర్నేషనల్ సర్ఫింగ్, మెగా మౌంటెన్ బైకింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 25 నుంచి 28వ తేదీ వరకు మలబార్ ఇవర్ ఫెస్టివల్‌ను సైతం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# నేడు నీటి సరఫరా బంద్



సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు ప్రాజెక్టులో సింగపూర్ నుంచి ఖానాపూర్ వరకు ఉన్న 1200 ఎంఎం డయా పీఎస్సీ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌లోని 350 ఎంఎం డయా స్లూయిస్ వాల్వ్‌కు మరమ్మతులు చేపట్టాల్సి ఉండటంతో బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. షేక్‌పేట్, టోలిచౌకి, గోల్కొండ, బోజగుట్ట, గండిపేట్, కోకాపేట్, నార్సింగి, పుప్పాల గూడ, మణికొండ, ఖానాపూర్, నెక్నంపూర్, మంచిరేవుల ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రొనాల్డ్ రాస్

# నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై వేస్తే కేసు

వంద శాతం జీవీపీ పాయింట్లను తొలగించాలి

వీధి వ్యాపారులు, వాణిజ్య దుకాణాల యాజమానులు

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించండి

పారిశుద్ధ్య కార్మికులకు బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టం అమలు చేయాలి

పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్షలో కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : వీధి వ్యాపారులు, షాపుల నిర్వాహకులు ఇష్టానుసారంగా చెత్త వేస్తే జరిమానా విధించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీధి వ్యాపారులు, వాణిజ్య దుకాణాల యజమానులు చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని, స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయాలని చెప్పారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో జోనల్ కమిషనర్లు, హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం అధికారులతో పారిశుద్ధ్య నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం, స్ట్రీట్ స్వీపింగ్ మిషన్స్ పర్యవేక్షణ, జీవీపీల తొలగింపు, సీ అండ్ డీ వేస్టేజ్, తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఎస్‌డబ్ల్యూజీ కార్మికుల హాజరును పర్యవేక్షించాలని, శానిటేషన్ వర్కర్ల హాజరుకు సంబంధించి మొబైల్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టం అమలుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిన్ పాయింట్ ప్రోగ్రాం చేయాలని, స్వీపింగ్ యంత్రాలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా బోర్డులను ప్రదర్శించాలని తెలిపారు.

### వ్యర్థాలను అక్రమంగా డంపింగ్ చేస్తే కఠిన చర్యలు

సీ అండ్ డీ వ్యర్థాలను అక్రమంగా డంపింగ్ చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టోల్ ఫ్రీ నంబర్, మొబైల్ అప్లికేషన్‌లకు సంబంధించి నౌరులకు, ట్రక్ ఆపరేటర్లకు అవగాహన కల్పించాలన్నారు. నగరంలోని పలు ఏరియాలలో నిర్మాణాలు చేపడుతున్న వారు నిర్మాణ మెటీరియల్‌ను రోడ్డుపైనే వేస్తున్నారని, అలాంటి వారికి జరిమానా విధించాలని, మెటీరియల్‌ను సీజ్ చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. జోనల్ స్థాయిలో అదనపు వాహనాలను అందించాలన్నారు. అన్ని మురికివాడల్లో ఎస్ఎల్ఎఫ్‌లతో అవగాహన కల్పించాలని, బల్క్ వేస్ట్ జనరేటర్లను పునరుద్ధరించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, చంద్రకాంత్‌రెడ్డి, సునంద, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, జోనల్ కమిషనర్‌లు రవికిరణ్, హేమంత్ బోర్కడే, అభిలాష్ అభినవ్, వెంకన్న, పీడీ సౌజన్య, స్వచ్ఛ భారత్ పీడీ భరత్‌కుమార్, ఏఎంహెచ్ఓలు పాల్గొన్నారు.

# బండి 15 ఏండ్లు దాటిందా?

## 5 ఏండ్లు రెన్యూవల్‌కు అవకాశం

సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : మీ వాహనం రిజిస్ట్రేషన్ చేసి 15 ఏండ్లు నిండిందా? గడువు ముగిసినా రోడెక్కుతున్నారా? అయితే జరభద్రం. నగరంలో ఆర్టీఏ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌తో 15 ఏండ్లు నిండిన వాహనాలను వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 15 ఏండ్లు నిండిన వాహనాలతో కాలుష్యం తీవ్రత అధికంగా ఉంటుంది. ఇలాంటి సమయంలో నగరంలో చాలా మంది 15 ఏండ్లు నిండిన వాహనాలను రెన్యూవల్ చేయించుకోకుండా వినియోగిస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేయడంలో భాగంగా 15 ఏండ్ల కాలపరిమితిని కేంద్ర ఉపరితల రవాణా శాఖ నిర్ణయించింది. అయితే వాహన సామర్థ్యాన్ని బట్టి మరో 5 ఏండ్లు రెన్యూవల్‌కు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో ద్విచక్ర, ఫోర్ వీలర్ వాహనాలకు గ్రీన్ ట్యాక్సీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన 15 ఏండ్లు నిండిన ద్విచక్ర వాహనానికి సాధారణ ఫీజు 14 32 ఉంటుంది. దీంతో పాటు గ్రీన్ ట్యాక్సీ 2వేలు చెల్లించాలి. గడువు ముగిసిన రోజులకు అంటే నెలకు రూ.300 చెల్లించాలి. ఈ మొత్తం ఫీజు మీసేవలో సంబంధిత ఆర్సీతో చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆధార్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఆర్సీ తదితర పత్రాలతో ఆర్టీఓ కార్యాలయంలో సబ్మిట్ చేయాలి. అనంతరం ఆ వాహనం మరో ఐదేండ్లు వినియోగించడానికి అనుమతి లభిస్తుంది. ఇదే లెక్కన 15 ఏండ్లు నిండిన ఫోర్ వీలర్ అయితే సాధారణ ఫీజు రూ.5,835తో పాటు గ్రీన్ ట్యాక్సీ రూ.5వేలు ఉంటుంది. గడువు ముగిసిన పెనాల్టీ అంటే నెలకు రూ.500 ఉంటుంది. ఈ మొత్తం ఫీజును మీ సేవలో చెల్లించి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఫోర్ వీలర్ 20 ఏండ్లు వినియోగించి ఉంటే గ్రీన్ ట్యాక్సీ రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. దీంతో మరో ఐదేండ్ల వరకు వాహనం వినియోగించే వీలు ఉంటుందని వివరించారు. గ్రేటర్‌లో 15 ఏండ్లు గడువు ముగిసిన వాహనాలను వెంటనే రెన్యూవల్ చేయించుకోవాలంటూ అధికారులు సూచించారు.